మహీంద్రా సరికొత్త ట్రాక్టర్

హైదరాబాద్, మార్చి 19: మహీంద్రా గ్రూపునకు చెందిన మహీంద్రా ట్రాక్టర్.. దేశీయ మార్కెట్లో ఓజా సిరీస్‌లో నయ ట్రాక్టర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులకు ఉపయోగపడే విధంగా తక్కువ బరువుతో రూపొందించిన 4 డబ్ల్యూడీ మహీంద్రా ఓజా 3140 మాడల్‌ను ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టింది. 30-40 హెచ్‌పీ సామర్థ్యంతో రూపొందించిన ఈ ట్రాక్టర్ ప్రారంభ ధర రూ.7.35 లక్షలు. ఈ ధరలు తెలుగు రాష్ట్రాలకు సంబంధించినవి. అడ్వాన్స్ గేర్ సిస్టమ్‌తో రూపొందించిన ఈ ట్రాక్టర్‌లో మొత్తంగా 24 గేర్లు ఉన్నాయి. చిన్న స్థాయి రైతులు సులభంగా, సురక్షితంగా వేగవంతంగా తమ భూమిని చదును చేసుకునే విధంగా దీనిని రూపొందించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే రబీ సీజన్‌లో ట్రాక్టర్లకు డిమాండ్ ఉంటుందని సంస్థ భావిస్తున్నది. అత్యాధునిక ప్రొజా, మైజా, రోబోజా వంటి టెక్నాలజీతో తయారైన ఈ మాడల్ పనితీరు చాలా మెరుగ్గావుంటుందని తెలిపింది.

ఈ-స్కూటర్లు ప్రియం!

ఏప్రిల్ 1 నుంచి 10 శాతం వరకు పెరగనున్న ధరలు

న్యూఢిల్లీ, మార్చి 19: ఎలక్ట్రిక్ స్కూటర్లు కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఇప్పుడే కొనేయండి. లేకపోతే ఈ నెల చివరి నుంచి వీటి ధరలు పెరగనుండటంతో మీ జేబుకు మరిన్ని చిల్లులు పడే అవకాశాలున్నాయి. ఈవీల వినిమయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీం-2024లో మార్పులు చేయడంతో ఈ స్కీం కింద సబ్సిడీలు తగ్గిపోనుండటంతో వాహన ధరలు పెంచడానికి సంస్థలు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెల 1 నుంచి ద్విచక్ర వాహన విక్రయ సంస్థలు తమ వాహన ధరలను 10 శాతం వరకు పెంచనున్నాయని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. ఇప్పుడిప్పుడే వీటికి ఆదరణ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ధరలు పెంచడం వల్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొంది. గతంలో ప్రకటించి ఫేమ్-2 స్కీం గడువు ఈ నెల చివరినాటికి ముగియనుండటం ఇందుకు కారణమని తెలిపింది. ఈ స్కీం కింద ద్విచక్ర వాహనాలపై రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు సబ్సిడీ లభిస్తుండేది. ఈ స్కీం గడువు ముగియనుండటంతో వాహన విక్రయ సంస్థలు ఈ భారాన్ని కొనుగోలుదారుడిపై వేయనుండటంతో వీటి ధరలు పెరిగే అవకాశం ఉన్నదని ఇక్రా ప్రతినిధి ఒకరు తెలిపారు. వచ్చే ఏడాది చివరినాటికి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వినియోగాన్ని 6-8 శాతానికి చేరుకోనున్నది.

5 లక్షల కోట్లు మటాష్

భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 736, నిఫ్టీ 238 పాయింట్ల డౌన్

- ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 3.15 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏయూ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ షేర్లు ఒక్కశాతానికి పైగా నష్టపోయాయి.
- కానీ, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ 2.66 శాతం నష్టపోగా, టెక్ 2.36 శాతం, టెలి కమ్యూనికేషన్ 1.74 శాతం, సర్వీసెస్ 1.60 శాతం, యుటిలిటీ 1.57 శాతం చొప్పున పడిపోయాయి.
- 2,583 సూచీలు నష్టపోగా, 1,234 సూచీలు లాభాల్లో ముగిశాయి.

ముంబై, మార్చి 19: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. 17 ఏండ్ల తర్వాత తొలిసారిగా జపాన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచడంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఒక్కసారి అలజడి రేపింది. జపాన్ ఆర్థిక వ్యవస్థ కూడా కుంటుపడుతున్నదని వచ్చిన సంకేతాలు మదుపరులను అమ్మకాలవైపు నడిపించాయి. గ్లోబల్ మార్కెట్లకు తోడు దేశీయ సూచీలు కూడా అదే బాట పట్టాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు బ్లూచిప్ సంస్థల షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం కూడా పతనానికి ఆజ్యంపోశాయి. ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఒక దశలో 72 వేల దిగువకు పడిపోయింది. చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది. మార్కెట్ ముగిసే సమయానికి 736.37 పాయింట్లు లేదా 1.01 శాతం నష్టపోయి 72,012.05 వద్ద ముగిశాయి. మరో సూచీ నిఫ్టీ కూడా 238.25 పాయింట్లు కోల్పోయి తన కీలక స్థాయి 22 వేల దిగువకు 21,817.45 వద్ద ముగిసింది. ఈవారంలోనే అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకోనుండటం కూడా మదుపరులు వేచి చూసేధోరణి అవలంభించారు. స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.4,86,777.98 కోట్లు కోల్పోయి రూ.3,73,92,545.45 కోట్లకు పరిమితమైంది.

పడేసిన టీసీఎస్

దేశీయ స్టాక్ మార్కెట్లు పతనానికి ప్రధాన కారణం టీసీఎస్. బ్లాక్‌డీల్ ద్వారా 2 కోట్ల టీసీఎస్ షేర్లను టాటా సన్స్ విక్రయించనున్నట్లు ప్రకటించడంతో కంపెనీ షేర్లు నాలుగు శాతానికి పైగా నష్టపోయాయి. ఈ దెబ్బకు మిగతా ఐటీ రంగ షేర్లు కూడా కుప్పకూలాయి. ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు భారీగా పతనం చెందాయి. వీటికి తోడు ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లె, పవర్ గ్రిడ్, ఐటీసీ, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు కూడా దిగువకు పడిపోయాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

పతనానికి కారణాలు

వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వు ఈ వారమే నిర్ణయం తీసుకోనుండటం మదుపరుల్లో ఆందోళన పెంచింది.

బ్లాక్‌డీల్ ద్వారా 2 కోట్ల టీసీఎస్ షేర్లను టాటా సన్స్ విక్రయించడంతో టీసీఎస్ షేర్లు భారీగా పతనమయ్యాయి. టీసీఎస్ షేర్లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి. ఈ దెబ్బకు ఐటీ రంగ షేర్లు కుదేలయ్యాయి.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గుచూపడం కూడా మరో కారణం.

అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడం కూడా మదుపరుల్లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

గత 17 ఏండ్లలో తొలిసారిగా బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీరేట్లను పెంచడం కూడా ఒక కారణం.

17 ఏండ్లలో తొలిసారిగా జపాన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచడం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. తీవ్ర ఒడిదొడుకుల మధ్య కొనసాగుతున్న దేశీయ సూచీలపై ఈ నిర్ణయం పిడుగు పడ్డట్టు అయింది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనావే సినదానికంటే అధికంగా నమోదుకావడంతో వచ్చే సమీక్షలో వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉండటం కూడాఆందోళనను పెంచింది. **- వినోద్ నాయర్, జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్**

మహబూబ్‌నగర్‌లో గ్లోబల్ లాజిక్ శాటిలైట్ ఆఫీస్

హైదరాబాద్, మార్చి 19: భారత్‌లో తన వ్యాపార విస్తరణలో భాగంగా హిటాచీ గ్రూపునకు చెందిన గ్లోబల్‌లాజిక్ తాజాగా మహబూబ్‌నగర్‌లో శాటిలైట్ కార్యాలయాన్ని ప్రారంభించింది. ప్రాంతీయ మార్కెట్‌పై దృష్టి సారించడంలో భాగంగా కంటెంట్ ఇంజినీరింగ్ వ్యాపారాన్ని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యాలయాన్ని నెలకొల్పింది. 18 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ నూతన ఆఫీస్‌తో కొత్తగా 180 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని కంపెనీ వైస్ ప్రెసిడెంట్, ఎండీ పీయూష్ జా తెలిపారు. సాంకేతిక ఆవిష్కరణల పురోగతికి వేదికగా ఈ ఆఫీస్ పనిచేయనున్నదని, కంటెంట్ ఇంజినీరింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు డాటా, జీఐఎస్ పరిష్కారాలు, ఆధునిక తరాలకు చెందిన ఏఐ ప్రాజెక్ట్ సహా పలు రకాల డొమైన్స్‌లో నాణ్యమైన సేవలు అందించడానికి వీలు పడనున్నదని పేర్కొన్నారు. ప్రత్యేకంగా హబ్ అండ్ స్పోక్ మాడల్‌ను కూడా పరిచయం చేస్తున్నట్లు, హబ్స్-టాలెంట్ హాట్‌స్పాట్స్‌కు సమీపంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ప్రతిభ ఉన్నవారికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో టెక్నాలజీ, ఐటీ విద్యను ప్రోత్సహించడానికి, ప్రతిభను బయటకు తీయడానికి తెలంగాణ అకాడమీతో ఒప్పందాన్ని కూడా కుదుర్చుకున్నట్లు చెప్పారు.

టీసీఎస్ ఉద్యోగులకు శుభవార్త

న్యూఢిల్లీ, మార్చి 19: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. ఈ ఏడాది ఉద్యోగుల వేతనాలను 7 శాతం నుంచి 8 శాతం వరకు పెంచబోతున్నట్లు ప్రకటించింది. ఆన్‌సైట్ స్టాఫ్ సిబ్బంది వేతనాలను 2-4 శాతం వరకు సవరిస్తున్నట్లు వెల్లడించింది. అధిక పనితీరు కనబరిచిన సిబ్బంది వేతనాలను మాత్రం 12 శాతం నుంచి 15 శాతం వరకు పెంచుతున్నట్లు తెలిపింది. పెరిగిన వేతనాలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 6 శాతం నుంచి 9 శాతం వరకు సవరించిన సంస్థ ఈ సారి మాత్రం కొంతమేర తగ్గించింది.

భెల్‌కు భారీ ఆర్డర్

న్యూఢిల్లీ, మార్చి 19: విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భెల్..ఎన్‌టీపీసీ నుంచి 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఆర్డర్ లభించింది. ఉత్తరప్రదేశ్‌లోని సింగ్రౌలీ వద్ద ఎన్‌టీపీసీ ఏర్పాటు చేయతలపెట్టిన 2 వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లో భెల్‌కు 1,600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఆర్డర్ లభించింది.

పన్ను వసూళ్లలో వృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 19: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల 17 నాటికి ప్రత్యక్ష పన్ను వసూళ్ల 19.88 శాతం పెరిగి రూ.18,90,259 కోట్లకు చేరుకున్నట్లు ఆదాయ పన్ను శాఖ వెల్లడించింది.

గృహ రుణాలపై బీఓఎం వడ్డీ తగ్గింపు

ముంబై, మార్చి 19: బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీఓఎం) గృహ రుణాలపై వడ్డీరేటును 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో రుణాలపై వడ్డీరేటు 8.45 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గాయి. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల చివరి వరకు మాత్రమే అమలులో ఉండనున్నాయని పేర్కొంది. అలాగే ప్రాసెసింగ్ ఫీజును కూడా బ్యాంక్ పూర్తిగా ఎత్తివేసింది. గృహ రుణాలపై బ్యాంకులు వసూలు చేస్తున్న వడ్డీరేట్లలో ఇదే తక్కువది కావడం విశేషం.30 ఏండ్ల కాలపరిమితితో గృహ రుణాలపై 8.3 శాతం వడ్డీ ప్రాతిపదికన రూపాయలు లక్షకు నెలకు ఈఎంఐ రూ.755 కానున్నది. మరోవైపు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్లపై కూడా 7 శాతం వార్షిక వడ్డీకి రుణాలను ఆఫర్ చేస్తున్నది బీఓఎం..ప్రాసెసింగ్ ఫీజును ఎత్తివేసింది. ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో 95 శాతం రుణంగా మంజూరు చేయనున్నది బ్యాంక్. ఈ రుణాన్ని 120 నెలల్లో తిరిగి చెల్లింపులు జరపవచ్చును.

ఐపీఎల్ ముచ్చట్లు

ఆర్‌సీబీ అన్‌బాక్స్

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అన్‌బాక్స్ ప్రోగ్రామ్ మంగళవారం చిన్నస్వామి స్టేడియంలో అట్టహాసంగా జరిగింది. కిక్కిరిసిన ప్రేక్షకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌సీబీ జెర్సీని ఆవిష్కరించారు. కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్, విరాట్ కోహ్లీ కొత్త జెర్సీలు ధరించి అభిమానులను అలరించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీఎల్ విన్నింగ్ కెప్టెన్ స్మృతి మందన తదితరులు పాల్గొన్నారు.

ముంబై తొలి పోరుకు సూర్య దూరం

ముంబై: ముంబై ఇండియన్స్ స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్‌పై ఇంకా సందిగ్ధత నెలకొన్నది. లీగ్‌లో భాగంగా ఈ నెల 24న ముంబై, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌కు సూర్య దూరం కానున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకునేందుకు ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో అతను పునరావాసం పొందుతున్నాడు. గత డిసెంబర్‌లో గాయపడ్డ ఈ డాషింగ్ బ్యాటర్..జాతీయ జట్టుకు దూరమయ్యాడు. ఇదిలా ఉంటే మంగళవారం ఎన్‌సీఏలో సూర్యకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించగా, పూర్తిగా కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గురువారం మరోమారు పరీక్ష నిర్వహించి అతని ఫిట్‌నెస్‌పై నిర్ధారణ వస్తామని ఎన్‌సీఏ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో హైదరాబాద్ (మార్చి 27), రాజస్థాన్ (ఏప్రిల్ 1), ఢిల్లీ (ఏప్రిల్ 7) మ్యాచ్‌లకు కూడా సూర్య దూరమయ్యే చాన్స్ కనిపిస్తున్నది. తన గాయాన్ని సూచిస్తూ లీగ్‌కు దూరం కాబోతుండటంపై పగిలిన హృదయంతో ఉన్న ఏమోజీని సూర్య ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

ఐపీఎల్‌లో స్మార్ట్ రిప్లే

ముంబై: ఐపీఎల్ సీజన్ కొత్త టెక్నాలజీతో ముందుకు రాబోతున్నది. ఔట్ల విషయంలో థర్డ్ అంపైర్ వేగంగా, కచ్చితత్వంతో నిర్ణయాలు తీసుకునేందుకు అనుగుణంగా ఈ సీజన్‌లో స్మార్ట్ రిప్లే సిస్టమ్ తీసుకొస్తున్నారు. ఈ టెక్నాలజీలో టీవీ అంపైర్‌కు ఇద్దరు హ్యాక్-ఐ సిస్టమ్ ఆపరేటర్లు నేరుగా ఇన్‌పుట్స్ అందిస్తారు. మైదానం మొత్తం కవర్ చేసే విధంగా ఎనిమిది హైస్పీడ్ కెమెరాలు తీసిన ఫొటోలతో థర్డ్ అంపైర్‌కు సాయం చేస్తారు. ఈ కొత్త సిస్టమ్..స్నిచ్ట్ ఇన్ స్క్రీన్ ఇమేజ్‌లతో గతంలో కంటే ఎక్కువ చిత్రాలను విశ్లేషించేందుకు అంపైర్లకు అవకాశం లభిస్తుంది. దీనికి తోడు ఏం జరుగుతుందనే దానిపై అభిమానులకు స్పష్టమైన అవగాహన లభిస్తుంది. ఈ మధ్యే దీనిపై అవగాహన కోసం అంపైర్లకు శిక్షణ అందించారు.

ఆట

అఫ్గన్, ఆసీస్ సిరీస్ వాయిదా

సిడ్నీ: మహిళల పట్ల జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా అఫ్గానిస్థాన్‌తో ఆగస్టులో జరుగాల్సిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) తాజాగా వాయిదా వేసింది. అఫ్గన్‌లో నానాటికీ మహిళలు, బాలికల పరిస్థితి దిగజారడం వలనే సిరీస్ వాయిదా వేస్తున్నట్లు సీఏ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. తాలిబన్ల అధికారంలో అఫ్గన్‌లో మహిళలపై అంక్షల పర్వం కొనసాగుతున్నది. ఆడపిల్లలను, యువతులను చదువు దూరం చేస్తూ, మహిళలు ఉద్యోగాలు చేయకుండా నిషేధం విధించింది. దీంతో అఫ్గన్ అవలంభిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా క్రికెట్ ఆస్ట్రేలియా ఈ నిర్ణయానికి వచ్చింది.

నాగల్ శుభారంభం

న్యూఢిల్లీ: భారత యువ టెన్నిస్ స్టార్ సుమిత్ నాగ్ మియామి ఓపెన్‌లో శుభారంభం చేశాడు. టోర్నీలో తొలిసారి బరిలోకి దిగిన నాగల్ మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిపయర్ తొలి రౌండ్‌లో నాగల్ 7-6(3), 6-2తో గాబ్రియెల్(కెనడా)పై అద్భుత విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌ను టైబ్రేక్‌లో గెలిచిన నాగల్..రెండో సెట్‌లో తనదైన దూకుడు కనబరిచాడు. దీంతో నాగల్ ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 92వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

లక్ష్యసేన్ @ 13

న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ లక్ష్యసేన్ బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇటీవలి ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో సెమీస్ చేరి ఆకట్టుకున్న లక్ష్యసేన్ ఐదు ర్యాంక్‌లు మెరుగుపర్చుకున్నాడు. ఏప్రిల్ నెలఖారు వరకు టాప్-16లో ఉన్న ప్లేయర్లు రానున్న పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధిస్తారు. ఫ్రెంచ్ ఓపెన్‌తో పాటు ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో రాణించడం ద్వారా సేన్ మెరుగైన ర్యాంకింగ్ అందుకున్నాడు. మరోవైపు హెచ్‌ఎస్ ప్రణయ్ (9), శ్రీకాంత్ (27), ప్రియాంశు రజావత్ (32) ర్యాంక్‌ల్లో ఉన్నారు. మహిళల విభాగంలో పీవీ సింధు 11వ ర్యాంక్‌లో ఉండగా, డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ శెట్టి టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నది.

కల నెరవేరేనా..?

టైటిల్‌పై కన్నేసిన పంజాబ్, ఢిల్లీ

ఐపీఎల్-17వ సీజన్‌కు మరో రెండు రోజుల్లో తెరలేవబోతున్నది. జట్లన్నీ అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. టైటిల్ గెలుపు లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నాయి. ఇప్పటి వరకు 16 సీజన్లు జరుగగా ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ ఐదేసి సార్లు ట్రోఫీని ఎగురేసుకుపోయాయి. లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లుగా చరిత్రకెక్కిన ముంబై, చెన్నైని నిలువరిస్తూ ఈసారి కొత్త విజేత పుట్టుకొచ్చే అవకాశం కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందని ద్రాక్షగా ఇన్నేండ్ల నుంచి ఊరిస్తూ వస్తున్న ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకునేందుకు పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. యువకులు, స్టార్ క్రికెటర్ల మేళవింపుతో సమవుజ్జీలుగా కనిపిస్తున్న ఈ రెండు జట్లు ఈసారైనా కప్ కల నెరవేర్చుకునేందుకు తహతహలాడుతున్నాయి.

ఈ నేపథ్యంలో జట్ల బలబలాలపై ప్రత్యేక కథనం

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

పంజాబ్ కింగ్స్: పేరులో కింగ్స్ ఉన్నా..సీజన్ సీజన్‌కు పంజాబ్‌కు అదృష్టం కలిసి రావడం లేదు. స్టార్లు, యువకులతో కనిపిస్తున్నా..పంజాబ్ జట్టు నిలకడలేమి సమస్యతో సతమతమవుతున్నది. హార్డ్ హిట్టర్ శిఖర్ ధవన్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న పంజాబ్ ఈ సారైనా తమ పంజా పవర్ ఏంటో చూపించేందుకు తహతహలాడుతున్నది. సరిగ్గా పదేండ్ల క్రితం 2014లో చివరి సారి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన పంజాబ్..మళ్లీ టాప్-4లో నిలువలేకపోయింది. గత సీజన్‌లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్న ధవన్‌సేన.. ఈ సారి మెరుగైన ప్రదర్శన కోసం పోటీకి దిగుతున్నది. వేలంలో భారీగా ఖర్చు పెట్టిన కింగ్స్ యాజమాన్యం..క్రిస్ వోక్స్, హర్షల్ పటేల్, రిలీ రొసో, శశాంక్ సింగ్, తనయ్ త్యాగరాజన్ లాంటి క్రికెటర్లను తీసుకుంది. వీరికి తోడు జానీ బెయిర్‌స్టో ఈ సీజన్‌కు పూర్తి అందుబాటులో ఉండటం పంజాబ్‌కు కలిసిరానుంది.

బలం: పంజాబ్‌కు ప్రస్తుతం బ్యాటింగ్ బలంగా కనిపిస్తున్నది. టాపార్డర్ బ్యాటర్లు శిఖర్ ధవన్, జానీ బెయిర్‌స్టో, రిలీ రోసోతో బండోబస్తుగా ఉంది. వీరికి తోడు మిడిల్‌లో లివింగ్‌స్టోన్, సికిందర్ రజా, సామ్ కరాన్ తమదైన రోజున మ్యాచ్‌ను ఒంటి చేత్తో మలుపు తిప్పడంలో సిద్ధహస్తులు. వికెట్‌కీపర్, బ్యాటర్ జితేశ్‌శర్మ ఇటీవలి ఫామ్ పంజాబ్‌కు అదనపు బలం.

బలహీనత: లీగ్‌లో స్పిన్నర్లదే హవా. అలాంటిది పంజాబ్‌కు రాహుల్ చాహర్, హర్‌ప్రీత్ బ్రార్ తప్ప నాణ్యమైన స్పిన్నర్లు లేకపోవడం ఒకింత వెలితిగా కనిపిస్తున్నది. గత సీజన్‌లో వీరిద్దరు కలిసి 17 వికెట్లు పడగొట్టగా, ఈ సీజన్‌లో వీరి ప్రదర్శన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. లివింగ్‌స్టోన్, రజా రూపంలో పార్ట్‌టైమ్ స్పిన్నర్లు ఉన్నా..పంజాబ్‌కు స్టార్ స్పిన్నర్ల కొరత వేధిస్తున్నది.

ఢిల్లీ క్యాపిటల్స్: స్టార్ క్రికెటర్ రిషబ్ పంత్ గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి రావడం ఢిల్లీకి కొండంత బలం చేకూర్చింది. అయితే అన్నీ ఉన్నా..అల్లుడి నోట్లో శని అన్నట్లు పేపర్ మీద బలంగా కనిపిస్తున్న ఢిల్లీ మైదానంలో ఆకట్టుకోలేక పోతున్నది. హిట్టర్లతో దట్టంగా కనిపిస్తున్నా..అనుకున్న మేర ఫలితాలు అందుకోలేకపోతున్నది.

బలం: పంత్ రావడం ఢిల్లీకి కొత్త ఊపు తీసుకురాగా, అతని కెప్టెన్సీ జట్టుకు అదనపు బలం కానుంది. వార్నర్, హెట్‌మైర్, మిచెల్ మార్ష్, పృథ్వీషా లాంటి హార్డ్ హిటర్లు బ్యాట్లు ఝుళిపిస్తే ఢిల్లీకి తిరుగుండకపోవచ్చు. వీరికి రికీ భుయ్, అభిషేక్, హోప్, స్టబ్స్ జత కలిస్తే ఢిల్లీ ఢోకా లేనట్లే.

బలహీనత: కుటుంబ కారణాలతో హ్యారీ బ్రూక్ పూర్తిగా సీజన్‌కు దూరం కావడం ఢిల్లీకి ఒక రకంగా ఎదురుదెబ్బ అని చెప్పొచ్చు. పేసర్ ఎన్రిచ్ నోర్జె ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. ముకేశ్, ఖలీల్ రాణించడంపై ఢిల్లీ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

పెర్త్‌లో భారత్, ఆసీస్ తొలి టెస్టు!

మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ ఏడాది ఆఖర్లో జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి పోరుకు పెర్త్ ఆతిథ్యమిచ్చే అవకాశముంది. ఆస్ట్రేలియా వార్తాసంస్థ సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ కథనం ప్రకారం ఇరు జట్ల మధ్య మొదటి టెస్టు పెర్త్‌లో జరిగే చాన్స్ ఉన్నట్లు పేర్కొంది. గతానికి భిన్నంగా ఈసారి నాలుగు టెస్టులకు బదులు ఐదు మ్యాచ్‌ల సిరీస్ జరుగనుంది. అడిలైడ్, బ్రిస్బేన్, మెల్‌బోర్న్, సిడ్నీ వేదికలుగా మిగతా మ్యాచ్‌లు జరుగుతాయని తమ కథనంలో రాసుకొచ్చింది. అయితే భారత్, ఆసీస్ టెస్టు సిరీస్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) నుంచి అధికారిక షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది. నవంబర్‌లో మొదలయ్యే అవకాశమున్న సిరీస్ పూర్తి షెడ్యూల్ ఈ నెల ఆఖర్లో విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత నాలుగు పర్యాయాల్లో భారత్ విజేతగా నిలిచింది.

ఢిల్లీ కెప్టెన్‌గా పంత్

న్యూఢిల్లీ: రానున్న సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా రిషబ్ పంత్ వ్యవహరించనున్నాడు. 2022 డిసెంబర్‌లో ఘోర కారు ప్రమాదం నుంచి బయటపడ్డ పంత్ గత 14 నెలల వ్యవధిలో ఎవరూ ఊహించని రీతిలో కోలుకున్నాడు. జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో పూర్తి ఫిట్‌నెస్ సాధించిన పంత్..త్వరలో మొదలయ్యే ఐపీఎల్-17వ సీజన్‌లో ఢిల్లీని ముందుండి నడిపించనున్నాడు. 'రిషబ్ పంత్ కెప్టెన్‌గా తిరిగి రావడాన్ని స్వాగతిస్తున్నాం. అతని పట్టుదల, భయంలేని తనం ఎప్పుడు బ్రాండ్ ఆఫ్ క్రికెట్‌ను శాసిస్తుంది. పంత్ ఇంత త్వరగా కోలుకోవడం పెద్దగా ఆశ్చర్యపర్చలేదు. పంత్ కెప్టెన్‌గా జట్టు నూతనోత్తేజంతో కొత్త సీజన్‌ను ప్రారంభిస్తుందని ఆశిస్తున్నాం'అని ఢిల్లీ సహ యజమాని పార్థ్ జిందాల్ అన్నాడు. ఈ నెల 23న తమ తొలి మ్యాచ్‌లో ఢిల్లీ..పంజాబ్‌తో తలపడుతుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/